
అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగన్


సీఎం రాకతో మహిళల్లో వెల్లివిరుస్తున్న ఆనందం


ఆప్యాయంగా పలకరిస్తూ..


చిన్నారిని ఆశీర్వదిస్తూ..

అడుగడుగునా నీరాజనం

కుక్కునూరు : వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు సోమవారం కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిర్వాసితులు అడుగడుగునా నీరాజనం పలికారు. ముఖ్యమంత్రి కాలినడకన గొమ్ముగూడెం గ్రామానికి పరిశీలించేందుకు వెళ్తున్న సమయంలో ఆయనతో కరచాలనం చేసేందుకు గ్రామస్తులు పోటీపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా వారికి అభివాదం చేసి ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అందరిని ఆదుకుంటామని నిర్వాసితులకు భరోసా కల్పించారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం కేఎంజీ యూత్ అధ్యక్షులు ఉగ్గం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పీపీఎస్ ఫౌండేషన్ అందించిన నోట్‌పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో కృష్ణ ఫాన్స్ సీనియర్ నాయకులు పీపీఎస్ చంద్రరావు, ఎ.సురేష్, ఫిరోజ్, ఎం.సాయి, గణేష్, గంగాధర్, సాయి, కిరణ్, కిషోర్, అనిల్ యాదవ్, నాగు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి


గద్దర్ మృతికి సంతాపం తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

కొయ్యలగూడెం : ప్రముఖ జానపద గేయ విప్లవకారుడు గద్దర్ సంస్మరణ కార్యక్రమం సోమవారం కొయ్యలగూడెంలోని సీపీఐ కార్యాలయం వద్ద నిర్వహించారు. విప్లవ, జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గద్దర్ మృతి బాధాకరమని పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పేదలు అనుభవిస్తున్న కష్టనష్టాలను తన పాటలతో కళ్లకు కట్టినట్లుగా నాటకాల రూపంలో ప్రదర్శించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ముందుగా గద్దర్ మృతికి మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్‌కే బాజీ, వెలగల రామారావు, మట్టా రామకృష్ణ, గోపాలం, ఇళ్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


కొత్తపలిలో కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణ కుమారి

లింగపాలెం : కొత్తపల్లిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం గ్రామ సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆవశ్యకతపై లబ్దిదారులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జి.సత్యన్నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేగంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. దశాబ్దాలుగా వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వస్తే చాలు రోడ్లు మురుగునీటితో నిండిపోవటం, ఇంటి పరిసరాల్లోనూ వర్షపునీరు నిలిచిపోయేది. పాలకులు మారినా వారి కష్టాలు అలాగే మిలిగిపోయాయి. ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక దృష్టి సారించి రూ.1 కోటితో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అరుంధతీపేట, వైఎంహెచ్ఏ హాలు, రామకోటి, గంగానమ్మ గుడి ప్రాంతం, వెంకన్న చెరువు ప్రాంతాల్లో ప్రస్తుతం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కొనసాగుతున్నాయి. సుమారుగా 15 అడుగులు లోతులో డ్రెయినేజీ పైపులైన్ ఏర్పాటు చేసి, డ్రెయిన్ క్లీన్ చేసేందుకు వాటికి అనుసంధానంగా మధ్యంలో మ్యాన్‌హోల్ నిర్మాణం, మురుగ నీటిని ఫిల్టర్ చేసేందుకు ప్రత్యేకంగా ట్యాంకులను నిర్మిస్తున్నారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, వైఎస్ఆర్‌సీపీ నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో డ్రెయినేజీ పనులు చేపడుతున్నారు.

పక్కాగా భూముల రీ సర్వే

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూమల రీ సర్వే పక్కాగా కొనసాగుతోందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయనకు కోమటిలంకకు చెందిన ఓ కుటుంబ సభ్యులు కుటుంబ వివాదం కొనసాగుతున్నందున రీసర్వే నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. పలువురు మహిళలు ఇంటి స్థల, రేషన్‌కార్డు కోసం దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములన్నీ నిర్ణీత కాల పరిమితిలో పూర్తి చేయాల్సుందన్నారు. వ్యక్తిగత, కుటుంబ తగాదాల కారణంగా రీసర్వే నిలుపుదల చేయడం సాధ్యం కాదని, పెద్దల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో కోర్టు ద్వారా న్యాయం పొందాలని సూచించారు.

సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్


జూనియర్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్

జంగారెడ్డిగూడెం : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ కిషోర్ కుమార్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు మొండి బకాయి తదితర కేసులు లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవాలన్నారు.

జాతీయ రహదారిపై పోలీసుల గస్తీ

దెందులూరు : మండలంలోని జాతీయ రహదారిపై గుండుగొలను, దెందులూరు, సోమవరప్పాడు బీట్లను ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది సోమవారం రాత్రి తనిఖీ చేశారు. గార్డు రికార్డు బుక్‌లను పరిశీలించారు. హైవేపై అనునిత్యం గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదా లు నమోదు కాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని, అర్ధరాత్రి లారీలు ఆపి డ్రైవర్లకు ఫేస్ వాష్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి


ద్వారకాతిరుమల : గుండుగొలనుకుంటలో తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం : రాజానగరంలో పౌష్టికాహార కిట్‌లను అందజేస్తున్న జెడ్పీటీసీ రామతులసి, సర్పంచ్ దుర్గమ్మ

ద్వారకాతిరుమల : తల్లిపాలు బిడ్డకు అమృతమని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ సీడీపీఓ పి.బ్యూలా అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంటలో సోమవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో సీడీపీఓ బ్యూలా, ఎంపీపీ బొండాడ మోహినీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తూ గ్రామంలో అవగాహనా ర్యాలీని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు మంచి పౌష్టికాహారమని, 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.మేరీ, ఎం.లక్ష్మీరాజ్యం, కె.మని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.అనంతలక్ష్మి, పుణ్యవతి, లక్ష్మి, తులసి, సరిత, అమ్మాజీ, సుష్మ, మహాలక్ష్మి, మాణిక్యమ్మ, భావాని, కృష్ణవేణి తదితరులున్నారు.

పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించాలి

బుట్టాయగూడెం : పిల్లలు పుట్టగానే ముందుగా వారికి తల్లిపాలు తాగించాలని జెడ్పీటీసీ మొడియం రామతులసి అన్నారు. మండలంలోని రాజానగరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజా దుర్గమ్మ, సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మారుమూల గ్రామాలైన ఒర్రింక, పులిరామన్నగూడెం, కొత్త రాజానగరం, తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

రంగాపురం హైస్కూల్‌లో విద్యార్థి నాయకుల ఎన్నిక


విద్యార్థులకు ఎన్నిక నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

లింగపాలెం : రంగాపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో సోమవారం 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థి నాయకుల ఎన్నిక నిర్వహించారు. ఎస్‌పీఎల్, డిప్యూటీ ఎస్‌పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. స్లిప్పుల విధానంలో ఎన్నికలు నిర్వహించి లెక్కించగా ఎస్‌పీఎల్‌గా పి.రత్నరాజు, డిప్యూటీ ఎస్‌పీఎల్‌గా కె.అనిల్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వెంకటరత్నం, ఉపాధ్యాయులు జి.రమణి, టి.వెంకటసత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఎంపీ శ్రీధర్ పరామర్శ

చింతలపూడి : ఊట సముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జి రమణారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సోమవారం పరామర్శించారు. రమణారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట సాహిత్య అకాడమీ చైర్మన్ శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డా.రాంబాబు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కూరగాయల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వరద ప్రభావిత ప్రాంతాలైన వేలేరుపాడు మండలానికి చెందిన సుమారు 200 మంది నిర్వాసితుల కుటుంబాలకు బొరగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ చేసినట్టు బొరగం ఫౌండేషన్ చైర్మన్ బొరగం దుర్గా ప్రసాద్ దొర ఏలూరులో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వర్గీకరణ చట్టబద్ధతకు అనుకూలంగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్‌మాదిగ

చింతలపూడి : ఏబీసీడీ వర్గీకరణ చట్టబద్ధతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా వ్యవహరించాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ సుప్రింపేటలో ఎమ్మార్పీస్ నియోజకవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ పిలుపుమేరకు హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త చౌటపల్లి విజయమాదిగ, నక్షత్ర మాదిగ, జిల్లా సమన్వయకర్త ఎస్.కనకరాజు, నియోజకవర్గ కన్వీనర్ తొమ్మండ్రు జోసఫ్ తంబి, కొలికిపాము హైమావతి, సౌజన్య మాదిగ, లంకా జయబాబు, సిద్ధు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ కళాశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం నిర్మించిన హాస్టల్ భవనం ప్రారంభించి వసతి కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఈ భూషణం, జిల్లా అధ్యక్షులు బి.వినోద్ కోరారు. సోమవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను పీడీఎస్‌యూ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఈ.భూషణం మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ కళాశాలకు 10.60 ఎకరాల విస్తీర్ణం కేటాయించి నూతన కళాశాల తరగతుల భవనాలు, బాయ్స్‌కు, గరల్స్‌కు హాస్టల్ భవనాలు నిర్మించారని, అయితే ఈ నూతన తరగతుల భవనాలను 2020 నుంచి ప్రారంభించినా నేటికీ హాస్టల్ భవనాలను ప్రారంభించలేదన్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు

వలంటీర్ సంస్మరణార్థం నగదు పురస్కారం


వలంటీర్ పద్మ సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : దివంగత వలంటీర్ కొడపాక పద్మ పేరిట నగదు పురస్కారంతో కూడిన స్మారక అవార్డును ప్రదానం చేయనున్నట్లు జగనన్న సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీ అనారోగ్య కారణాలతో మృతి చెందిన కొయ్యలగూడెం గ్రామ వలంటీర్ కొడపాక పద్మ సంస్మరణ కార్యక్రమం సత్యసాయి నగర్‌లో వలంటీర్ల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దివ్యాంగురాలు పద్మ వలంటీర్‌గా విశేష సేవలు అందించి ప్రజలలో మంచి గుర్తింపు పొందారని వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ సంకుకొండ అన్నారు. కొయ్యలగూడెంలోని నాలుగు సచివాలయాల పరిధిలో ఒక ఉత్తమ వలంటీర్‌ను ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపిక చేసి ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున నలుగురికి అందిస్తామని నూకల రాము తెలిపారు. ఈ సందర్భంగా పద్మ చిత్రపటానికి నివాళులర్పించి ఆమె ఆత్మశాంతికై శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పద్మ కుటుంబ సభ్యులను ఫోన్‌లో ఓదార్చారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నగదు సంస్మరణ అవార్డును ప్రకటించినందుకు నూకల రాముని ఎమ్మెల్యే, ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు ఫోన్ ద్వారా అభినందించారు. సచివాలయ ఉద్యోగులు, సచివాలయాల కన్వీనర్లు గృహ సారథులు పాల్గొన్నారు.

19న వార్డు సభ్యుల ఎన్నిక

ద్వారకాతిరుమల: మండలంలో ఖాళీ అయిన రెండు పంచాయతీ వార్డులకు ఈనెల 19న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్ సోమవారం తెలిపారు. ద్వారకాతిరుమలలోని 8వ వార్డు సభ్యుడు నడికట్టి ప్రసాద్ కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే గుణ్ణంపల్లిలోని 6వ వార్డు సభ్యురాలు తన పదవికి రాజీనామా చేసి, వలంటీర్‌గా పనిచేస్తున్నారు. దీంతో ఖాళీ అయిన ఆ రెండు వార్డులకు ఎన్నిక నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 8 నుంచి 10 వరకు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. అలాగే 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఎన్నికలు జరుగుతాయన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం


జంగారెడ్డిగూడెం : సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినోత్సవం సందర్భంగా మురళీ కృష్ణ మహేష్ యువసేన ఆధ్వర్యంలో ఎంకేఎంవై అధ్యక్షులు బవిరిశెట్టి మురళీకృష్ణ, మహేష్ బాబు అభిమానులు సంయుక్తంగా మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. గంగానమ్మ గుడి వెనక మురళి జ్యూస్ సెంటర్ నందు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు సేవలందిస్తారన్నారు. ఈమేరకు సోమవారం భక్తాంజనేయ స్వామి ఆలయాల చైర్మన్ కలగర వీర్రాజు, చింత నాగరాజు చేతులమీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు కోరారు. ఎంకేఎంవై సెక్రటరీ మద్రి రమేష్‌బాబు, దిర్శిపాము రాజేష్, ఎస్ పవన్ చారి, షేక్ రజాక్ పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు


నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న జేడీ జయప్రకాష్


చింతలపూడి : చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాలలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి జయప్రకాష్ సోమవారం విచారణ జరిపారు. ఆదివారం నాడు గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో చపాతీలు చేయించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. సంఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించడంతో జేడీ విచారణ చేపట్టారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. పాఠశాలలో బాలికలతో పనులు చేయించిన ఘటనపై విద్యార్థినులను విడివిడిగా విచారించారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి


బుట్టాయగూడెంలో శాంతి ర్యాలీ అనంతరం ప్రార్థనలు చేస్తున్న పాస్టర్స్

బుట్టాయగూడెం : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను అరికట్టాలని కోరుతూ బుట్టాయగూడెంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని మణిపూర్‌లో శాంతీయుత వాతావరణం నెలకొనాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షులు అకుల శాస్త్రి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో స్త్రీలపై దాడులు బాధాకరమని అన్నారు. అల్లర్లు, హింసాకాండను అరికట్టి శాంతీయుత వాతావరణం నెలకొల్పే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు కె.డానియేలు, టి.పౌలు, ఎం.జోసఫ్, కె.జార్జిముల్లర్, పి.దావీద్, ఎస్‌కే బషీర్ పాల్, జి.ఫిలిప్స్, ఎస్.ఇస్సాక్, కుమార్ పాల్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అందుగుల ఫ్రాన్సిస్, ఎస్.రామ్మోహన్, తగరం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్స్‌కి సత్కారం


పరింపూడి హైస్కూల్లో సత్కారం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం : ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను అందిపుచ్చుకొని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులు రాణిస్తున్నారని స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పరింపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ టాపర్స్‌గా నిలిచిన ఏడుగురు విద్యార్థులకు సోమవారం సంస్థ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఉమాదేవి ఆధ్వర్యంలో ఏడుగురు విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి, జ్ఞాపికను, ప్రశంసా పత్రం సంస్థ సభ్యులు అందజేశారు. ఎం.వీరఐశ్వర్య, జి.యజ్ఞశ్రీ రాఘవ, కె.పల్లవి, ఎస్.ప్రబంధ వర్షిణి, ఏజీపీ మహాలక్ష్మి, ఎ.పావని, ఎ.బిందు ప్రియదర్శిని సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్కే జహంగీర్, ఏవీఆర్ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఏలూరు రూరల్: నులిపురుగుల నివారణతో పిల్లలు, పెద్దలు మరింత ఆరోగ్యవంతంగా జీవించవచ్చని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆగస్టు 10న వరల్డ్ డి వార్మింగ్ డేని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కడుపులో నులిపురుగుల పెరగడం వల్ల పిల్లలు ఎదుగుదల మందగిస్తుందని చెప్పారు. పెద్దల ఆరోగ్యంపై సైతం ప్రభావం కనిపిస్తుందన్నారు. ఈ సమస్య నివారణకు ఏడాదికి ఒకసారైనా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆగస్టు 10న అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు, స్కూల్స్ పిల్లలు, కళాశాలలో చదువుకుంటున్న యువతకు నులిపురుగు నివారణ మాత్రలు అందించాలన్నారు. చాటపర్రు పీహెచ్‌సీ వైద్యురాలు చందన మాట్లాడుతూ ఒకటి నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర కడుపులో వేయాలన్నారు. మాత్రలు వేసుకున్న పిల్లలను కొద్దిసేపు గమనించాలని సూచించారు. రెండు నుంచి 18 ఏళ్ల యువతీ యువకులకు రెండు మాత్రలు వేయాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి మాత్రలు ఇవ్వొదని సూచించారు. అనంతరం ఎంపీపీ చేతుల మీదగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్ టీచర్లు, వైద్య సిబ్బందికి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, గుడివాకలంక ఎంఈఓ ఆనంద్, ఎంఈఓ రంగయ్య పాల్గొన్నారు.

28న ఏలూరులో ర్యాలీ

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగబద్ధమైన ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 28న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఏలూరులో భారీ ర్యాలీ, అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు జేఏసీ అడహక్ కమిటీ పేర్కొన్నారు. స్థానిక పెద్ద పోస్టాఫీస్ ఆవరణలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అడహక్ జేఏసీని ఎన్నుకున్నారు. సమావేశానికి రాష్ట్ర గౌరవ సలహాదారుడు బేతాళ సుదర్శనం హాజరయ్యారు.